కవకాశంవున్న కైవారం గల పాత్ర అది. ఇలావుండగా ఓనాడు రాత్రి ఏంజరిగిందీ! వీరసింగు మహదేవ్ ఒక్కడే ఉన్నాడు ఇంటిలో! ఇల్లంతకూ వొక్కడే! అన్ని గొళ్ళాలు వేసేసి. లోపల గెడెట్టుకు, మరి కూర్కు కనబోతున్నాడు. ఇఖ నిశ్చింతగా! అట్టె! ఓ బేబీ! అంటే పిల్లవాడు! అంటే శిశువు! ఒకడు ఎఱ్ఱ కలువ చాయనో రెండు చేతులూ, నల్ల కలువ చాయనో ముఖమూ, టెస్టుట్యూబ్ పగల, విసరి, కేరుమన్నాడు! లోకంలోని కలలన్నీ వొక్కమారు కాంతిల్లి తేజరిల్లినట్టు, లోకంలోని తెలివిఅంతా కేంద్రీకరణమై ధ్వనించినట్టు !

వీరసింగు మహదేవ్ తక్షణం పాడ్ నుంచి ఒక లెటర్ పేపరు చించి, కుర్రాణ్ణి చూడకుండానే ఇలా వ్రాశాడు : "బొడ్డు కోయనక్కఱలేదు. పాలైనా ఇవ్వ నక్కఱలేదు. బిడ్డడు బాగానే ఉన్నాడు. నీవీ నిమిషమునుండి నా యింటికి రానవసరములేదు. యు ఆర్ డిస్చార్జిడు ఫ్రంమ్ దిస్ మోమెంట్" అని వ్రాసి వెంటనే వీరవల్లి కందచేశాడు.

ఆ చీటీ యందుకుని యటుతర్వాత వీరవల్లి మిక్కిలి చింతించిందై తాను కనబోయే పిల్లవాడు వాడే యేమోనని, ఆ యింట్లోకి ఎలాగైనా వెళ్ళి ఆ పిల్లణ్ణి చూదామనుకుంది. కాని ఆ యింటి తలుపులు నాటికీ నేటికీ అభేద్యాలై ఊరుకున్నాయి!

.... .... ....

# అసలైన సిసలైన స్వేచ్ఛను అందుకోండి!

"అయిదువందల రూపాయలు ఖరీదు
చేసే ఆటవస్తువు కొన్నాను: చూసుకో"

అనిఅంటూ భర్త ఒకపేకేజీపెట్టె కూలివానినెత్తినుండి చావడిలో దించుతూ కూలివాణ్ణి పంపించివేసి వంటింటికేసి చూచాడు.

భార్య : "నాకా ? పిల్లలకా ?" అంటూ చక్కా వచ్చింది.

భ_ర్త : "నీకూ, పిల్లలకూను, నీవుమాత్రము పిల్లల కన్న ఎక్కువ తెలివైనదానవా ?"

భార్య : "అలా చేశేశారు !" అని చెప్పే జవాబు వినకుండానే భ_ర్త పేకెజీపెట్టె విప్పుచుండెను.

పిల్లలు చుట్టూ మూగసాగిరి.

తల్లి వెంటనే "చుట్టూ మూక్కండి. 500 రూపాయలు ఖరీదుచేసే ఆటవస్తువు వుంటుందా ? దూరంగావుండండి" అని పిల్లలను బెదరించింది.

పిల్లలలో వొకడు "బందర్లాడూలేమో ? బంగాళాదేశపు రసగుల్లాలేమో ?—

తల్లి : "అస్తమానం మీకు తిండిగోడవే ! అరసంచీ రూపాయల ఖరీదుచేసే లాడులేమిట్రా ! లక్షణమైన కాసుల పేరో, వరహాలపేరో అయివుంటుంది."

భ_ర్త : "అవి నీ ఆటవస్తువులా ?"

భార్య : "నాకే అవ్వాలా ఏమిటి ? నా మెళ్లో మీరు వేస్తే ఈ చంటికూన చంకెక్కి ఆడుకోడూ ? మీ రెప్పుడూ చదవలేదూ, వేమృణాళాంకురశంకనంబెడు గజాస్యుని గొల్తుమదభీష్టసిద్ధికై" అన్నది.

భ_ర్త : "మనము చేయబోయే కార్యమునకు వేరే బ్రాహ్మణుడు, విఘ్నేశ్వరపూజ అక్కర లేకుండా చక్కని పద్యపాద ముటంకించినావు !"

భార్య : "ఆటవస్తువుతో కార్యమేమిటండీ ?"

భ_ర్త : "చెప్తా ! పెరట్లోకివెళ్ళి ముందు ఒక వెదురు కఱ్ఱ తీసికొనిరా ?"

భార్య : " నేను తీసికొనిరాను "

పిల్లలు పరస్పరము " మనము వెళ్ళి తీసికొని వద్దాము."

తల్లి : " మీరు వెళ్ళారా ? తంతాను. "

భర్త : " ఎందుకే అంత భయం ?"

భార్య : " నన్ను దానితో కొడతారేమో అని "

భర్త : " కొట్టను " అని పేకేజీ ఇంకా విప్పుచుండెను.

భార్య పెఱటిలోనికి వెళ్ళి గెడకర్ర తెచ్చెను. అప్పటి కప్పుడే భర్త పేకేజీ విప్పి అందులోనుంచి ఒక కొత్త రేడియో పెట్టెను పైకితీసి టేబిల్‌మీద అమర్చెను. గెడకర్రకోసము ఎదురు చూచుచుండెను.

భార్య : " రేడియోటండీ ? మీరన్న 500 రూపాయల ఆటవస్తువూను ? మఱిఉన్న గడకర్ర వొక్కటీ మీ రేడియోకి ఇచ్చివేస్తే నా త్రివర్ణ పతాకం దేనికి కట్టేది ?"

భర్త : " కొన్నావుటే నీవున్నూ ?"

భార్య : " ఆఁ ! కొన్నాను అయిదు అణాలు పెట్టి " అని అలమారులోనుండి జాతీయ పతాకం తీసి, చుట్టివున్న దాన్ని విప్పుతూ " దీన్ని ఈ రోజున సరిగా కేంద్రమందు మన మంత్రులు ప్రమాణం గొనేటప్పుడు ఈ గెడకర్రకు కట్టి స్వరాజ్య చిహ్నంగా నిలబెట్టాలనుకొన్నాను. "

భర్త : " జెండాకు నా చేతికర్ర ఉపయోగించు. "

భార్య : మఱి సాయంకాలం అడిగేరా మీ చేతికర్ర మీకివ్వను సుమండీ, తిరిగి ఒక పర్యాయము ప్రతిష్ఠించిన తరువాత మఱి ఊడదీయనేరను. బాగా ఆలోచించుకోండి !"

భర్త : "ఈపైనుండి మనకు బెత్తాల్తో పనిలేదు. మన చేతులందు ఖడ్గములే తళతళ లాడగలవు" అని మొలనుండి యొక నిశితఖడ్గమును వెలికి దూసెను.

భార్య ఆశ్చర్యముతో "మన మంత్రులింకను పదవిని స్వీకరించకుండగనే ఆయుధ శాసనము రద్దయినదా?" అని అడిగెను.

భర్త : "రద్దుకానక్కఱలేదు. రద్దు కావలెనని కోర నవసరములేదు. అరుణోదయములా అహింసాతత్వము మన దేశమందు వ్యాప్తినెంది ఖడ్గములును, కత్తులును చేతికర్రలవలె ఒకగంటనుండి అమ్మఁడువోవుచున్నవి. దసరా వీరపూజకైననూ పనికివచ్చునని ఒకఖడ్గం కొన్నాను."

పిల్లలు : "ఆలా అయితే దీపావళికి మేము స్వేచ్ఛగా తుపాకులే పేలుస్తాము!"

భార్య : "ఆలాగే చేయండి! కాని ఆకాశంలోకి పేల్చండి! జాతీయ ప్రభుత్వావిర్భావఁడుదయమైనది అహింసా భావారుణరాగ మధ్యమ మందు అన్నమాట మఱువకండి. రండి, ఇదిగో మీ నాన్నగారి చేతికర్రకు దీన్నిగట్టి మన స్వరాజ్య పతాకమును నట్టింట అహింసాతత్వసుబుద్ధితో ప్రతిష్ఠించు చున్నాను." అని హెచ్చరించింది.

భర్త : "నేను రేడియోగుండా మన చావడిలో ఈపై నుండి "జవహర్" కావించెడు ఉపన్యాసములు వినుచున్నాను!" అని రెచ్చెను.

పిల్లలు : "మమ్మల్ని ఏమిచేయమంటారు?" అని తండ్రికేసి ఒకపర్యాయం, తల్లికేసి ఒక పర్యాయం చూచిరి.

తండ్రి : " అమ్మచేసిన స్వీటూ, సేవరీ, లగాయించండి" అన్నాడు.

భార్య : " ఏంచేశానని మీవూహ ?"

తండ్రి ఆలోచనలోవుంటాడు. ఒక పిల్లవాడు తండ్రి దగ్గరసా వెళ్ళి చెవిలో వూదేడు " తీపి, జహంగీరూ, అక్బరు పాదుషా, చేసిందండి ! మఱి మొహం మొత్తకుండా కారపు జంతికలు వేసిందండీ !" అని—

భర్త : " ఏమేవ్ ! జిన్నా కలిసిరాకపోయినా నీవు జహంగీరును, అక్బరు పాదుషాను అభిమానంతో ఇంకా చూస్తూనే వున్నావు ?"

భార్య : " జిన్నా అంటే కలిసిరాకపోవచ్చునుగాని మేటి జహంగీర్లు, అక్బరు పాదుషాలు మనకు తప్పరు, మనతోటివారె " ఎల్లకాలం !" అంది.

భర్త : " ఎల్లాకాలం " అన్న ఏస ఎక్కడ పట్టుపడిందే నీకు ? "

పిల్లలు : " ఈవేళ మన యింటిముందు ఇద్దరు ఫకీర్లు వచ్చి నిలబడి అదేదో కిర్రుకిర్రు తిప్పుకొంటూ పాడారులేండి. " ఎల్లాకాలం " అంటూ అని తండ్రికి తెలియబఱిచారు.

తల్లి : " పొద్దమే కాకుండా మనల్ని మన పిల్లల్ని దీవించారు కూడాను. "

భర్త : " మిక్కిలి శుభసూచకం ! తరుణమైనది ! అదిగో ! అఖండ భారతవర్ష స్వాతంత్ర్యోషస్సు ! జాగుచేయక, పిల్లలారా ! మీజనని. నా జాయ, మన నట్టింట నిలిపిన జాతీయ

పతాకను ఆరాధించండి. మాతో కలిసి అర్పించండి. ఆకాశమున కెగరవేయండి. అసలైన, సిసలైన స్వేచ్ఛను అందుకోండి! వందేమాతరం!"

.... .... .... .... ....

## సారమేయమౌ? అప్రమేయమౌ?

చావడి అంతా సైలెన్సు. సైలెన్సు లోనే ఆమె అడుగు లోపలకు పెట్టింది. తెలిసికొన్నదప్పుడే అక్కడ ఆ చావడిలో కూచున్నది తన భర్తే అని—రుసరుస ముఖం అతనూ ఆమె భర్తే! అతను!

"లైఫ్ చూడవద్దటండీ!"

"కాఫీ టైముకు ఏడవవద్దటండీ?"

పై సంభాషణవాక్యాలు రెండూ కూడా అండీలతోటే అంత్యం చూపించడంవల్ల ఎవరేదన్నది, ఎవరు ఎవరిని మన్నించింది, ఎవరు ఎవరిని పలుకరించింది తెలిసికోవడం స్పష్టంగా వివరిస్తేనే గాని తెలిసికోవడం కష్టమేమో కాగితం మీద. కంఠాన్ని బట్టి తెలిసికోగలిగినా—మొదటి వాక్యం భార్యది. రెండోవాక్యం భర్తదీని. మఱి భార్య, "ఇక్కడ బల్లమీదపెట్టి, తలుపు తీసివుంచే వెళ్ళాను. ఇంకా అంతకంటె వెల్లడిగా ఎవరు చూపించగలరు చేసి? ఈ బల్లమీద పెట్టి వెళ్ళాను. కప్పునిండా పోసి సాసరులో కప్పు వుంచి" అని బల్ల చూపింది. "అవేనా?" దూరాన్ని ఉన్న ఉత్తివాటిని చూపాడు భర్త. "ఆవే! కాఫీ కాజేసే అల్లా ఇదవుతారు? టౌన్‌లో కూడా ఇంత ఖాయిదా